# లైన్ క్లియర్... ★

రచన :
శ్రీ బచ్చువీర్రాజు.

అప్పుడే 'మౌలాలీ'లో 'గార్డ్ ట్రెయినింగ్' పూర్తి చేసుకొని. యింటికొచ్చి పడ్డాను. ప్రయాణ బడలిక తీరాక, నా రూమ్‌లో పడి వున్న నా లెటర్స్‌ను పరిశీలిస్తూ కూర్చున్నాను.

ఆ లెటర్స్ అన్నింటిలోనూ, ఓ నీలిరంగు కవరు నన్నమితంగా ఆకర్షించడం చేత దానిని చింపి చూశాను. లోపల గల కాగితంపై అక్షరాలు ముత్యాలు పొదిగినట్లు చక్కగా వున్నాయి. గబ, గబా తీసి చదివాను.

వైజాగ్
ది॥ 5-5-82

శ్రీ రాజుగార్కి,

అభిమాని 'దేవి' నమస్కరించి వ్రాయునది - మీరు 'నవజ్యోతి' పత్రికలో వ్రాసిన 'కరిగిన కల' 'తీరినకోరిక' 'ఓమైగాడ్'! కథానికలు వరుసగా చదివి, మీ రచనా చాతుర్యానికి ఎంతగానో ఆకర్షితురాలనై మీ అభిమానిగా మారాను. దానికి రూపమే నాయీ అభినందన లేఖ.

నా గురించి చెప్పుకోవలసింది పెద్దగా ఏమీ లేదు. బి. యస్. సి. చదువుతున్నాను. వయస్సు పద్దెనిమిది యింకా సంసారబంధంలో చిక్కుకో లేదు.

నా ఆశయం మీవంటి వారి శిష్యరికంలో ఓ రచయిత్రిగా రూపు దిద్దుకోవాలని మాత్రమే.

మీ పూర్తి వివరాలు తిరుగు జవాబులో యివ్వ గలరని ఆశిస్తూ...

యిట్లు,
మీ అభిమాని 'దేవి'

అడ్రస్ పరికించి చూశాను. ఎందుకనో ఈ టీనేజ్ యువతి నా మనస్సులో చోటు చేసుకో నారంభించింది. ఆ వుత్తరంలోని పాత్ర వెనుక దాగిన ఆమె 'సభ్యత' 'సంస్కారం' నన్ను బాగా ఆకట్టుకొన్నాయి.

వెంటనే నా వివరాలతో ఆ యువతికి ఓ వుత్తరం వ్రాసి పడేశాను రచయితగా నా అదృష్టాన్ని నేనే మెచ్చుకొంటూ.

* * *

అప్పుడే డ్యూటీ ముగించి యింటికొచ్చాను. ఓసారి వంటింట్లోకి తొంగి చూశాను.

నన్ను చూసి అమ్మ తొందర, తొందరగా అడుగులు వేసుకొంటూ దగ్గర కొచ్చింది. 'రామాయణం' ఏదో విప్పుతుందని అనుకున్నాను. అలాగే జరిగింది కూడా.

'ఒరేయ్! మావయ్య ఉత్తరాల మీద, ఉత్తరాలు, గుప్పుతున్నాడు. కబుర్ల మీద కబుర్లు పంపిస్తున్నాడు. వెళ్ళి ఒక్కసారి వాళ్ళమ్మాయి జానకిని చూసి రారా. నీకు పుణ్యం వుంటుంది. నీకు నచ్చితే సరి, లేకుంటే లేదు, నామాట కాస్త వినరా. అమ్మ అంది.

'అది సరే! యింతకీ ఎవరీ మావయ్య? ప్రశ్నించాను నెమ్మదిగా.

'ఎవరేమిట్రా? స్వయానా మా అన్నయ్య. యిన్నాళ్ళూ బొంబాయిలో వుండబట్టి న్యూసూ, ఊసూ లేదు. ఈమధ్యనే ట్రాన్స్‌ఫర్ అయ్యి విశాఖపట్నం వచ్చాడు. ఆ మధ్య నువ్వు ట్రైనింగ్‌కి వెళ్ళినప్పుడు మనయింటికి వచ్చి నీగురించి మరీ, మరీ అడిగి నీ ఫోటో కూడా

తీసుకు వెళ్ళాడురా!' అమ్మ చెప్పుకు పోతోంది హుషారుగా.

'ఓహో! చిన్నప్పుడు యింట్లో చెప్పా, చెయ్యక పారిపోయిన మావయ్యా? ' చటుక్కున ప్రశ్నించాను.

'అవునవును. ఆ మావయ్యే. అమ్మాయి అపరంజి బొమ్మలా వుంటుందట. ఓసారి వెళ్ళి చూడరా' అమ్మ ప్రాధేయ పడసాగింది.

'సరేలేమ్మ! వచ్చే నెల మా అసోసియేషన్ వాళ్ళ మీటింగ్ అక్కడే జరుగ బోతోంది. వెళ్ళివస్తానులే' అన్నాను యింక అమ్మ గొడవ పడలేక.

ఁ ఁ ఁ

ఈమధ్యలో 'దేవి' నుంచి, ఓ నాలుగైదు లెటర్సదాకా వచ్చాయి. ఆఖరి వుత్తరం నన్ను బాగా ఆకర్షించి, మత్తులో ముంచేసింది. మరో సారి ఆవుత్తరం తీశాను.

వైజాగ్
10-6-82

శ్రీ ప్రియమైన రాజుగారికి...

అభిమాని 'దేవి' నమస్సులు :

మీ కథలతో, వుత్తరాలతో నా మదిలో మీరు బాగా చోటు చేసుకొన్నారు. మిమ్మల్ని స్వయలగా చూడాలని మనస్సు తహ, తహ లాడు తోంది. తేది॥ 15-7-82 న నా పుట్టిన రోజు, ఆరోజు జగదాంబా టాకీస్‌కు నా స్నేహితురాళ్ళతో ఫస్ట్ షో ప్రోగ్రాం వేసు కొన్నాం. ఏది ఏమైనా ఆరోజుకు మీరు అక్కడికి వచ్చి స్వయంగా మీ శుభాకాంక్షలంద జేస్తూ, 'అతిథి'గా ఆ రాత్రి మాయింట్లో విందారగించి వెళ్ళగలరని ఆశిస్తాను. మీరు రావడం జరగకపోతే, మనిద్దరి మధ్యా స్నేహలత యికసాగదు. నాకు చాలా కోపం వస్తుంది. తస్మాత్! జాగ్రత్తమరి. మీరు నన్ను గుర్తు పట్టడానికి వీలుగా ఆరోజు నా కిష్టమైన బ్లూ కలర్ పరికిణీ, బ్లూ కలర్ జాకెట్, లైట్ కలర్ వోణీ వేసుకొని, రెండు జడల రాణీగారిలా ప్రత్యక్ష మవుతాను. తప్పక వస్తారు కదూ!

సెలవు
మీరాకకై వేయికళ్ళతో ఎదురు
చూసే 'దేవి'

ఒకసారి వాచీ వంక చూశాను. అది 12వ తేదీ సూచిస్తోంది. సడన్‌గా మళ్ళీ వుత్తరం వంక చూసాను అది 15వ తేదీ. ఒక్కసారి గుర్తుకు వచ్చింది. అదే రోజు నేను మీటింగ్‌కు అటెండ్ కావలసిన రోజు. హుషారుగా ఈల వేసి నిలబడ్డాను.

♦ ♦ ♦

ఆ రోజు మీటింగ్ అయ్యాక హడావుడిగా ఆటో మీద 'జగదాంబా థియేటర్' దగ్గర కొచ్చి పడ్డాను. ఆటో డ్రైవర్‌కు డబ్బు చెల్లించి, ఓసారి నలువైపులా దృష్టి సారించి చూసాను. 'ఆడపిల్లల పటాలం' ఎక్కడా కని పించలేదు.

కొంచెంసేపు వెయిట్ చేశాను. యింతలో బిల, బిలా ఓ టీనేజ్డ్ లేడీస్ గ్రూప్ థియేటర్ దగ్గరకు రావడం మొదలు పెట్టింది.

గబ, గబా అందరినీ పరీక్షించడం మొదలు పెట్టాను. తక్కున నా కళ్ళు ఓచోటు నిలిచి పోయాయి.

అదే రంగు పరికిణీ, జాకెట్, వైట్ కలర్ వోణీలో మిల, మిలా మెరిసి పోతోంది ఓ అమ్మాయి.

(తరువాయి 19 పేజీ)

(10వ పేజీ తరువాయి)

చక్కటి అందం లావుకు తగ్గ పొడవు. మనిషికి తగ్గ స్టైల్‌తో కళ, కళ లాడి పోతోంది.

ఒక్కసారి నా గుండె కొట్టుకోవడం ఆగిపోయి నట్లైంది. నెమ్మదిగా వాళ్ళ మధ్యకు ప్రవేశించి, 'మై సెల్ఫ్ రాజా ఫ్రం రాజమండ్రీ' అన్నాను కాస్త సిగ్గుపడుతూ.

అంతా ఒక్కసారి కళ్ళు చారిడేసంత చేసుకొని, గబ, గబా షేక్‌హ్యాండ్ తీసుకోవడం మొదలు పెట్టారు. దేవి నవ్వుతూ ఏదో చెప్పుకు పోతోంది ఎంతో హుషారుగా.

డ్రింక్స్ అయ్యాక నెమ్మదిగా థియేటర్‌లోకి ప్రవేశించాం. 'ది లాస్ట్ హార్ట్ మెన్' ఆడుతోంది.

థియేటర్‌లో కూర్చోగానే, జేబులోంచి ఓ చిన్న ప్యాకెట్ తీసి, దేవికి అందించాను. ముందు దేవి దానిని వద్దని తిరిగి యిచ్చి వేసింది. నేనే బలవంతం చేసి, స్నేహితురాళ్ళంతా చూస్తుండగా అందులో గల ఓ 'ముత్యపు టుంగరం' తీసి దేవి కందించాను. దేవి మరేమీ మాట్లాడక కృతజ్ఞతగా చూస్తూ తీసుకొంది.

* * *

సినిమా వదిలిపెట్టాకు. నే నెంత వెళ్ళిపోతా నని గింజుకొన్నా, వాళ్ళు నన్ను వదిలి పెట్ట లేదు.

అంతా ఆటోలో దేవి యింటికి వచ్చి పడ్డాం. యింటికెళ్ళగానే నన్ను దేవి, వాళ్ళమ్మ గారికి పరిచయం చేసింది. నవ్వుతూ ఆమెకు నమస్కారం చేసాను. ఆవిడ కూడా ప్రతి నమస్కారం చేసింది.

యింతలో మా కోలాహలం చూసి, బహుశా దేవి నాన్నగారను కొంటాను ఆయన లోపలి గదిలోంచి హాలులోకి వచ్చి నిలబడ్డారు.

నన్ను ఆయనకు చూపించి, వారికి కూడా నన్ను పరిచయం చేసింది దేవి.

యింతలో హఠాత్తుగా ఆయన లోపలకెళ్ళి పోయి చేత ఓ ఫోటో పట్టుకొని ప్రవేశించారు.

నన్ను చూసి నువ్వు నువ్వు మా భవానీ కొడుకువు...కదోయ్? అంటూ ప్రశ్నించారు ఆశ్చర్యంతో.

అవునండి! అంటూ తల వంచుకొన్నాను.

'అంటే? మన...' మధ్యలో ఆగిపోయారు దేవి అమ్మగారు 'మన అల్లుడేనే వీడు. అమ్మాయ్! అమ్మాయ్! వీడు నా మేనల్లుడేనే వీడు నా మేనల్లుడేనే' అంటూ ఆయన చిందులు తొక్కుతూవుంటే 'ఆ సంగతి నాకు థియేటర్ దగ్గరే తెలుసు' అంటూ సిగ్గుపడ్తూ లోపలికి తుర్రుమంది దేవి.

'అదేరా! మా అమ్మాయి జానకీ దేవి...' అని ఆగాడు మావయ్య.

నేను నవ్వుతూ తలదించు కొన్నాను ఆనందంగా.

TRADE MARK
PANJU TEX
మన్నికకు, ఆహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
♦ మాస్టర్ ♦ ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.